# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 31 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 5 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :31 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 5 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





# ఏపీలో ‘తల్లికి వందనం’.. రెండో విడతకు రంగం సిద్ధం

- సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ
- ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ
- వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం




ఆంధ్రప్రదేశ్‌లో ‘తల్లికి వందనం’ పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన

- మిగతా 2లో

## ఫ్లైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి..

## అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు

- అమెరికా, ఇజ్రాయెల్ విమానాలపై దాడులకు అల్ ఖైదా మద్దతుదారుల పిలుపు
- ఇటీవలి ఫ్లైదుబాయ్ హైజాక్ యత్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన
- 9/11 దాడులను గుర్తుచేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కథనం
- ‘అల్ బయాన్’ అనే వారపత్రికలో ఈ మేరకు పిలుపునిచ్చిన ఉగ్రవాదులు

- మిగతా 2లో





# అది ఆగ్రహం కాదు, ఉత్సాహం..

## జైరాం రమేశ్‌కు చంద్రబాబు, లోకేశ్ కౌంటర్

- మదనపల్లె సభపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ట్వీట్
- ప్రజాగ్రహం అంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు
- తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్
- అది ప్రజల ఉత్సాహమే తప్ప ఆగ్రహం కాదని చంద్రబాబు వివరణ
- వాస్తవాలు తెలుసుకోకుండా ట్వీట్ చేస్తారా అంటూ లోకేశ్ ఫైర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు సమాచారం ఆధారంగా వ్యాఖ్యలు చేయడం ఏంటని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది ప్రజాగ్రహం కాదని,

- మిగతా 2లో



## జైరాం.. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు

- జైరాం రమేశ్ పోస్టుపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం
- ఏపీ సభలో కనిపించింది ప్రజల ఉత్సాహమేనని స్పష్టీకరణ
- అది ప్రజాగ్రహమంటూ జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం
- కాంగ్రెస్ నేతపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీవ్ర అభ్యంతరం
- అన్నమయ్య జిల్లా సభ ఘటనపై సోషల్ మీడియాలో మాటల యుద్ధం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. “జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని

- మిగతా 2లో

# 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు..

## చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్



ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి

- మిగతా 2లో

## విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం



- ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్
- విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ
- కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి
- హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు
- ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఫ్లైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి..

## అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు

అంతర్జాతీయంగా మరోసారి ఉగ్రవాద దాడుల కలకలం రేగింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై దాడులు చేయాలంటూ అల్ ఖైదా మద్దతుదారులు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని, 2001 సెప్టెంబర్ 11 దాడులను స్ఫూర్తిగా తీసుకుని 'కాపీక్యాట్ దాడులు' (అచ్చం అలాంటి దాడులే) చేయాలని తమ పత్రిక ముఖంగా రెచ్చగొట్టారు. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేసింది. అల్ ఖైదా మద్దతుతో నడుస్తున్న 'అల్ బయాన్' అనే అరబిక్ వారపత్రిక ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. "యుద్ధం ఇంకా ముగియలేదు. జియోనిస్టులు, అమెరికన్లు, ఇస్లాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర అవిశ్వాసులను మోసుకెళ్లే విమానాలు ఇంకా ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 11, సెప్టెంబర్ 30న జరిగినట్లుగా వాటిని లక్ష్యంగా చేసుకోవచ్చు" అని ఆ కథనంలో పేర్కొన్నారు. 9/11, ఫ్లైదుబాయ్ ఘటనలకు సంబంధించిన చిత్రాలను కూడా దీనికి జోడించారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని నేలకూల్చేందుకు విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ విమాన కో-పైలట్, కాక్‌పిట్‌లోని గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో విమానం వేగంగా కిందకు దూసుకెళ్లి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ హైజాక్ యత్నానికి పాల్పడిన కో-పైలట్ ఒమన్‌కు చెందినవాడని, అతనికి తీవ్రవాద భావజాలం ఉందన్న కారణంతో గతంలోనే ఒమన్ అధికారులు విమానాలు నడపకుండా నిషేధం విధించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలోనే అల్ ఖైదా మద్దతుదారులు ఈ ఘటనను ఓ విజయంగా చిత్రిస్తూ దాడులకు పిలుపునివ్వడం గమనార్హం. శనివారం టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ పోస్ట్ సర్క్యులేట్ అయినప్పటికీ, ఆ తర్వాత దానిని తొలగించినట్లు తెలుస్తోంది.

# అది ఆగ్రహం కాదు, ఉత్సాహం..

- మొదటి పేజి తరువాయి

ప్రజల ఉత్సాహం అని స్పష్టం చేస్తూ ఘాటుగా బదులిచ్చారు.

**అసలేం జరిగింది?**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతుండగా, సభలో ఉన్న కొందరు యువకులు కేకలు, అరుపులతో కాస్త గందరగోళం సృష్టించారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, వారిని శాంతపరిచి ప్రసంగం సజావుగా సాగేలా చూశారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జోడించాడు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

**చంద్రబాబు, లోకేశ్ తీవ్ర స్పందన**

జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "జైరాం జీ, జరిగిన దానికి మీ వ్యాఖ్యానానికి ఏమాత్రం సంబంధం లేదు. మీరు దేన్నైతే ప్రజాగ్రహం అని తప్పుగా చిత్రీకరించాలని చూస్తున్నారో, అది వాస్తవానికి ప్రజల నుంచి వచ్చిన అపూర్వమైన, ఉత్సాహపూరితమైన స్పందన. సభలో వారి ఉత్సాహం అధికంగా ఉండటంతో, కార్యక్రమం సజావుగా సాగేందుకు నేను జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ప్రజల ఉత్సాహాన్ని ఆగ్రహంగా పొరబడటం చూస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు మీరు ఎంత దూరంగా ఉన్నారో అర్థమవుతోంది. రాజకీయ ప్రేరేపిత సోషల్ మీడియా కథనాలతో వాస్తవాలను మార్చలేరు" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

మంత్రి నారా లోకేశ్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. "ఫేక్ న్యూస్‌ను తయారుచేసేది ఇలాగే. సీనియర్ కాంగ్రెస్ నేతలు వాస్తవాలను కూడా సరిచూసుకోకుండా దాన్ని ప్రచారం చేస్తారు. ఉద్యోగాలు కావాలంటూ ఆర్థిక మంత్రి ప్రసంగానికి స్థానిక యువత అంతరాయం కలిగించారన్నది పూర్తిగా అవాస్తవం. ప్రజలతో సాధారణ సంభాషణను ఉద్దేశపూర్వకంగా కత్తిరించి, వక్రీకరించి కట్టుకథ అల్లుతున్నారు. జైరాం రమేశ్ గారూ, మీలాంటి సీనియర్ నేత ట్వీట్ చేసే ముందు వాస్తవాలు సరిచూసుకోవాలి. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం తగదు. ఆ అబద్ధాన్ని తొలగించండి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.

# 'కమర్షియల్'కు క్వీన్ ఆమెనా..?

- సీనియర్‌ను రానివ్వకుండా... మొత్తం కమర్షియల్‌ను 'అమ్మ' కంట్రోల్‌లోకి తీసుకున్నారా?
- 'అమ్మ' ప్రసన్నమైతేనే పని ముందుకా?
- వెసల్‌కు బెర్త్ కావాలంటే ఒక రేటు ఉందా?
- డబ్బులు ఇస్తే బెర్త్‌పై పని... ఇవ్వకపోతే యాంకరేజ్‌కా?
- "పైవారికి ఎవరి వాటా వారికి పంపిస్తా" అంటున్నారన్న ఆరోపణల్లో నిజమెంత?
- ఆన్‌లైన్ సిస్టమ్ ఉన్నా పర్సనల్‌గా కలవాల్సిందేనా?
- జూనియర్ స్టాఫ్‌ను సొంత పనులకు వాడుకుంటున్నారా?
- 'గ్రీన్ ఎనర్జీ' వెనుక అసలు కథేంటి?
- విజిలెన్స్ ఉన్నా ఫోన్, మెయిల్ పనిచేయవా?
- గతంలో సీబీఐ రైడ్ జరిగినా మార్పు రాలేదన్న ప్రచారంలో నిజమెంత?

'పెన్ పవర్' ఇన్వెస్టిగేషన్ గ్రౌండ్ రిపోర్ట్। ఎపిసోడ్--2

ఇన్వెస్టిగేషన్ నెట్ వర్క్ , పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 04 : విశాఖపట్నం పోర్టు కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో అసలు ఎవరి మాట నడుస్తోంది? రూల్స్ ప్రకారం వ్యవస్థ నడుస్తోందా? లేక మొత్తం వ్యవస్థ ఒకే అధికారి కంట్రోల్‌లోకి వెళ్లిందా? పోర్టు వర్గాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఆ చర్చల్లో పదేపదే వినిపిస్తున్న పేరు కాకుండా ఒకే పిలుపు- 'అమ్మ'

**సీనియర్‌ను రానివ్వకుండా... టోటల్ కంట్రోల్?**

కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అధికారి ప్రత్యక్షంగా వ్యవహారాల్లోకి రాకుండా, కీలకమైన నిర్ణయాలన్నీ తన కంట్రోల్‌లోనే ఉండేలా 'అమ్మ' వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ ఫైల్ ముందుకు వెళ్లాలి? ఏది పెండింగ్‌లో ఉండాలి? ఎవరికి ముందుగా అప్రూవల్ రావాలి? ఎవరు వెయిట్ చేయాలి? ఏ వెసల్‌కు బెర్త్ ఇవ్వాలి? అన్న విషయాల్లో ఒకే వ్యక్తి ప్రభావం ఎంత ఉందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సీనియర్ అధికారులకు పూర్తి సమాచారం వెళ్తోందా? లేక కమర్షియల్‌లోనే కథ ముగుస్తోందా?

**ప్రతి వెసల్‌కు ఒక 'రేటు' ఫిక్స్ చేశారా?**

పోర్టుకు వచ్చే ప్రతి కార్గో వెసల్‌కు బెర్త్ ఇవ్వడానికి ఒక అనధికారిక రేటు ఫిక్స్ చేశారన్న సమాచారం కొన్ని వర్గాల నుంచి వినిపిస్తోంది. నిజంగా అలాంటి రేటు ఉందా? ఉంటే ఎవరు నిర్ణయిస్తున్నారు? ఏజెంట్‌తో ఎవరు మాట్లాడుతున్నారు? పేమెంట్ ఎక్కడ జరుగుతోంది? బెర్తింగ్ ప్రోగ్రామ్‌కు ముందు డీల్ జరుగుతోందా? లేక బెర్త్ వచ్చిన తర్వాత మొదలవుతోందా? వెసల్ బెర్తింగ్ రికార్డులు, ఏజెంట్ కమ్యూనికేషన్, ఫైల్ మూవ్‌మెంట్ బయటకు వస్తే నిజం తేలుతుంది.

**"పైవారికి వాటా పంపిస్తా" అంటున్నారా?**

"నాకు మాత్రమే కాదు... పైవారికి ఎవరి వాటా వారికి పంపిస్తా" అన్న తరహాలో బహిరంగంగా మాట్లాడుతున్నారన్న సమాచారం. అసలు ఆ 'పైవారు' ఎవరు? నిజంగానే ఎవరికైనా వాటాలు వెళుతున్నాయా? లేక పై అధికారుల పేర్లు చెప్పి ఏజెంట్లను భయపెడుతున్నారా? ఈ ఆరోపణ నిజమైతే విచారణ 'అమ్మ' దగ్గర ఆగకూడదు. డబ్బు వెళ్లే చివరి పాయింట్ వరకు వెళ్లాలి.

**డబ్బులు ఇస్తే బెర్త్... లేకపోతే యాంకరేజ్?**

వెసల్ బెర్త్ మీదకు వచ్చిన తర్వాత మరో రకం ఒత్తిడి మొదలవుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. "పని సరిగ్గా జరగడం లేదు." "కార్గో హ్యాండ్లింగ్ స్లోగా ఉంది." "పర్ఫార్మెన్స్ బాగోలేదు." అంటూ ఏజెంట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారట. అక్కడే అసలు ప్రశ్న. డబ్బులు ఇస్తే అదే వెసల్ బెర్త్‌పై కొనసాగుతుందా?

డబ్బులు ఇవ్వకపోతే : "యాంకరేజ్‌కు షిఫ్ట్ చేయండి" అనే ఆదేశం వస్తుందా? ఎందుకంటే ఒక వెసల్‌ను బెర్త్ నుంచి యాంకరేజ్‌కు పంపడం వల్ల షిప్పింగ్ కంపెనీకి సమయం, ఇంధనం, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఈ విషయంలో వెసల్ పర్ఫార్మెన్స్ రిపోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ వివరాలు, షిఫ్టింగ్ ఆర్డర్లు, యాంకరేజ్ రికార్డులు, ఏజెంట్ కంప్లైంట్లు, బయటకు రావాలి. డబ్బు ఇచ్చిన వెసల్‌కు ఒక రూల్... ఇవ్వని వెసల్‌కు మరో రూల్ అమలవుతోందా? అన్నది తేలాలి.

'అమ్మ' సంతకం కోసం పడిగాపులా? : కమర్షియల్‌లో సంతకం కోసం ఏజెంట్లు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫైల్ కంప్లీట్. డాక్యుమెంట్స్ కంప్లీట్. ఆన్‌లైన్ అప్లికేషన్ కంప్లీట్. అయినా---

'అమ్మ'ను పర్సనల్‌గా కలవకపోతే అప్రూవల్ రాదా? : అదే ఇప్పుడు ఏజెంట్ల ప్రశ్న. ఆన్‌లైన్ సిస్టమ్ ఉంటే పర్సనల్ విజిట్ ఎందుకు? పర్సనల్ విజిట్ తప్పనిసరి అయితే ఆన్‌లైన్ సిస్టమ్ ఎందుకు?

**జూనియర్ స్టాఫ్ కూడా 'అమ్మ' సొంత పనులకా? :** కిందిస్థాయి ఉద్యోగులను కూడా అధికారిక డ్యూటీలకు కాకుండా వ్యక్తిగత పనులకు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరిని? ఏ పనికి? ఎన్ని సార్లు? డ్యూటీ టైమ్‌లోనా? పోర్టు వెహికల్స్ ఉపయోగించారా? దీనికి సమాధానం చెప్పేది--- అటెండెన్స్ రికార్డు, డ్యూటీ రోస్టర్, వెహికల్ లాగ్ బుక్, గేట్ ఎంట్రీ, సీసీటీవీ ఫుటేజ్. రికార్డులు ఓపెన్ చేస్తే నిజం బయటపడుతుంది.

**'గ్రీన్ ఎనర్జీ'... అసలు కథేంటి? :** కమర్షియల్‌లో ఇప్పుడు మరో పేరు బలంగా వినిపిస్తోంది, 'గ్రీన్ ఎనర్జీ' గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన అసలు వ్యవహారం ఏమిటి? ఏ కంపెనీ? ఏ ప్రాజెక్ట్? ఎవరు ప్రపోజ్ చేశారు? ఎవరు రికమెండ్ చేశారు? ఎవరు అప్రూవ్ చేశారు? కమర్షియల్ డిపార్ట్‌మెంట్ పాత్ర ఎంత? ఏదైనా ప్రత్యేక ప్రయోజనం కల్పించారా? ఈ ఫైల్ బయటకు వస్తే 'గ్రీన్ ఎనర్జీ' వెనుక గ్రీన్ సిగ్నల్ ఎవరిదో తెలుస్తుంది.

**ఏజెంట్లపై ప్రెజర్ ఎందుకు? :** షిప్పింగ్ ఏజెంట్లు బహిరంగంగా మాట్లాడటానికి ఎందుకు భయపడుతున్నారు? ఈరోజు మాట్లాడితే రేపు వచ్చే వెసల్‌కు ఇబ్బంది వస్తుందన్న భయమా? బెర్త్ ఆలస్యమవుతుందా? అప్రూవల్ ఆగుతుందా? యాంకరేజ్‌కు పంపిస్తారన్న భయమా? అందుకే ఏజెంట్ల నుంచి కాన్ఫిడెన్షియల్ స్టేట్‌మెంట్స్ తీసుకుంటే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది.

**విజిలెన్స్ ఉందా... ఉన్నా ఉపయోగం లేదా? :** పోర్టులో విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఉంది. కానీ--- ఫోన్ చేస్తే స్పందన ఉందా? మెయిల్ చేస్తే రిప్లై వస్తుందా? కంప్లైంట్ ఇస్తే అక్నాలెడ్జ్‌మెంట్ వస్తుందా? కంప్లైంట్‌పై యాక్షన్ తీసు కుంటున్నారా? లేక విజిలెన్స్ పేరు బోర్డుకే పరిమితమైందా? విజిలెన్స్ ఫోన్, మెయిల్ రెండూ పనిచేయడం లేదన్న ఆరోపణలపై పోర్టు యాజమాన్యం వెంటనే స్పందించాలి.

**గతంలో సీబీఐ రైడ్ జరిగినా మార్పు లేదా? :** 'అమ్మ'పై గతంలో సీబీఐ రైడ్ జరిగిందన్న ప్రచారం కూడా పోర్టు వర్గాల్లో వినిపిస్తోంది. ఇది నిజమా? నిజమైతే- ఏ కేసు? ఏ సంవత్సరం? ఏ ఆరోపణ? ఏం స్వాధీనం చేసుకున్నారు? కేసు పరిస్థితి ఏమిటి? డిపార్ట్‌మెంటల్ యాక్షన్ జరిగిందా? తిరిగి కీలకమైన కమర్షియల్ పోస్టింగ్ ఎలా వచ్చింది? సీబీఐ రైడ్ జరిగిందన్న సమాచారం నిజమైతే పూర్తి రికార్డు ప్రజల ముందుకు రావాలి.

**అసలు నిజం తేలాలంటే ఈ రికార్డులు చాలు :** బెర్తింగ్ ప్రోగ్రామ్, వెసల్ అరైవల్ రికార్డు, బెర్త్ అలాట్మెంట్ వివరాలు ,వెసల్ పర్ఫార్మెన్స్ రిపోర్టులు , కార్గో హ్యాండ్లింగ్ రికార్డులు , యాంకరేజ్ షిఫ్టింగ్ ఆర్డర్లు, ఏజెంట్ కమ్యూనికేషన్ , ఫైల్ మూవ్‌మెంట్, అప్రూవల్ టైమింగ్స్ , విజిటర్ రిజిస్టర్, సీసీటీవీ ఫుటేజ్, విజిలెన్స్ కంప్లైంట్ రిజిస్టర్, ఇవి ఓపెన్ చేస్తే- ఎవరు నిజం చెబుతున్నారు? ఎవరు అబద్ధం చెబుతున్నారు? ఎవరి వెనుక ఎవరు ఉన్నారు? అన్నది బయటపడుతుంది.

**చివరికి ఒకటే ప్రశ్న... :** కమర్షియల్ డిపార్ట్‌మెంట్‌లో రూల్స్ నడుస్తున్నాయా? లేక 'అమ్మ' రూల్ నడుస్తోందా? బెర్త్‌కు రేటు ఉందా? యాంకరేజ్‌ను బెదిరింపుగా వాడుతున్నారా? ఏజెంట్ల నుంచి వసూళ్లు జరుగుతున్నాయా? పైవారి పేర్లు ఎందుకు వినిపిస్తున్నాయి? సీనియర్ అధికారులకు అసలు విషయం తెలుసా? విజిలెన్స్ ఎందుకు స్పందించడం లేదు? ఈ ప్రశ్నలకు పోర్టు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిందే.

**ఎపిసోడ్--3లో...**

'అమ్మ' వెనుక ఉన్నది ఎవరు? బెర్త్ నుంచి యాంకరేజ్‌కు వెళ్లిన వెసల్స్ కథేంటి? ఏజెంట్ల వద్ద ఉన్న ఆధారాలేంటి? 'గ్రీన్ ఎనర్జీ' ఫైల్‌లో ఎవరి సంతకాలు? పైవారి వాటా ఆరోపణ ఎక్కడికి చేరుతుంది? విజిలెన్స్ రికార్డులు ఏం చెబుతున్నాయి? అమ్మ గారి మరిన్ని బాగోతాలు పెన్ పవర్ పాఠకులకోసం ... వచ్చే సంచికలో ..

# ఏపీలో 'తల్లికి వందనం'.. రెండో విడతకు రంగం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు.

అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే

అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

# 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు..

## చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

- మొదటి పేజి తరువాయి

శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు.

**దేశానికే ఆదర్శం 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ**

ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు టెక్నాలజీ గురించి వివరించారు. ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

**9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

**షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మి అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జైరాం.. మీరింత తొందరపడతారని

# నేను అనుకోలేదు

- మొదటి పేజి తరువాయి

నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు.

అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

## విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.




# పట్టాలపై పశ్చిమ ప్రకాశం భవిష్యత్తు..!

**జిల్లా కేంద్రానికే రైల్వే కనెక్టివిటీ కరవు**

**ఒంగోలు-దొనకొండ సర్వే వేళ.. మార్కాపురం--ఒంగోలు డిమాండ్**

**శ్రీశైలం యాత్రకు గేట్‌వే.. హార్టికల్చర్ హబ్‌కు రవాణా అవసరం**

**పలకల పరిశ్రమకు సరుకు రవాణా ఊతం**

**ఇది రైలు మార్గం కాదు.. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి హక్కు**

**మార్కాపురం( స్టాప్ రిపోర్టర్)పెన్ పవర్ అక్టోబర్ 04**

ప్రకాశం జిల్లా విభజనతో మార్కాపురం జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకుంది. పరిపాలన కేంద్రమైంది.. అభివృద్ధిపై ఆశలు పెరిగాయి. కానీ జిల్లా కేంద్రాన్ని నేరుగా రైల్వే నెట్‌వర్క్‌తో కలిపే మార్గం మాత్రం ఇప్పటికీ లేదు. ఇదే సమయంలో ఒంగోలు--దొనకొండ కొత్త రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో మార్కాపురం--ఒంగోలు రైల్వే మార్గాన్ని కూడా పరిశీలించాలన్న డిమాండ్ పశ్చిమ ప్రకాశంలో బలపడుతోంది.

**జిల్లా కేంద్రానికే పట్టాలు ఎక్కడ..?**

జిల్లా కేంద్రం అంటే పరిపాలనతో పాటు ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రబిందువు. మార్కాపురం పట్టణానికి సమీపంలో మార్కాపురం రోడ్ రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ.. జిల్లా కేంద్రం అయిన మార్కాపురం పట్టణానికే నేరుగా రైల్వే లైన్ లేకపోవడం ప్రధాన లోటు.జిల్లా ఏర్పడింది.. పరిపాలన వచ్చింది.. మరి జిల్లా కేంద్రానికి నేరుగా రైల్వే కనెక్టివిటీ ఎప్పుడు? అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

**ఒంగోలు--మార్కాపురంఅభివృద్ధి రేఖ..**

ఒంగోలు ప్రధాన రైల్వే మార్గంలో కీలక కేంద్రం. మార్కాపురం--ఒంగోలు రైల్వే కనెక్టివిటీ ఏర్పడితే పశ్చిమ ప్రకాశానికి ప్రధాన రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం బలపడే అవకాశం ఉంది.ప్రయాణికులు, రైతులు, వ్యాపారులు, పరిశ్రమలు, విద్యార్థులు, ఉద్యోగులు,అనేక వర్గాలకు దీని ప్రయోజనం విస్తరించవచ్చు.

**శ్రీశైలం యాత్రకు గేట్‌వే.. మార్కాపురం..**

శ్రీశైలం వెళ్లే పశ్చిమ, దక్షిణ ఆంధ్ర ప్రాంతాల యాత్రికులకు మార్కాపురం--దోర్నాల మార్గం కీలక రహదారి అనుసంధానం.మార్కాపురం వరకు రైల్వే కనెక్టివిటీ మెరుగుపడితే రైలు ద్వారా వచ్చే యాత్రికులు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం చేరుకునే అవకాశం ఉంటుంది. దీంతో మార్కాపురం, దోర్నాల ప్రాంతాల్లో పర్యాటక, వ్యాపార కార్యకలాపాలకు ఊతం లభించవచ్చు.

**త్రిపురాంతకం.. నెమలిగుండ్లకు బూస్ట్..**

పశ్చిమ ప్రకాశంలో త్రిపురాంతకం బాల త్రిపురసుందరి ఆలయం, నెమలిగుండ్ల వంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే భక్తులు, పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉంది.

రైల్వే--రోడ్డు అనుసంధానంతో ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయవచ్చు.

**హార్టికల్చర్ హబ్‌కు రవాణా గతి ఏది..**

బత్తాయి, నిమ్మ, మామిడి వంటి ఉద్యాన పంటలకు మార్కాపురం ప్రాంతంలో ప్రాధాన్యం ఉంది. హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తితో పాటు గ్రేడింగ్, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్, మార్కెటింగ్, రవాణా వ్యవస్థ కూడా బలపడాలి.భవిష్యత్తులో భారీగా వ్యవసాయ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తే రైల్వే సరుకు రవాణా కీలకంగా మారవచ్చు.

**పలకల పరిశ్రమకు రైల్వే ఊపిరి..**

మార్కాపురం పలకల పరిశ్రమకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. రహదారి రవాణాపై అధికంగా ఆధారపడటం వల్ల దూర ప్రాంతాలకు సరుకు తరలింపులో ఖర్చు పెరుగుతోంది.రైల్వే సరుకు రవాణా సదుపాయం వస్తే భారీ మొత్తంలో ఉత్పత్తులను తక్కువ వ్యయంతో తరలించే అవకాశం ఉంటుంది. పరిశ్రమలు, ఉపాధి, స్థానిక వ్యాపారాలకు ఇది ఊతమివ్వవచ్చు.

**పొదిలి.. దర్శి.. ముండ్లమూరు..**

పశ్చిమ ప్రకాశంలో మార్కాపురంతో పాటు పొదిలి, దర్శి, ముండ్లమూరు, యర్రగొండపాలెం, గిద్దలూరు ప్రాంతాలకు కూడా మెరుగైన రవాణా అవసరం ఉంది.మార్కాపురం--ఒంగోలు రైల్వే మార్గం ఏర్పడితే పశ్చిమ ప్రకాశంలోని అనేక ప్రాంతాలకు ఒంగోలు మీదుగా ప్రధాన రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం బలపడే అవకాశం ఉంటుంది.

**దొనకొండ సర్వే వేళ.. మార్కాపురం ఎందుకు..?**

ఒంగోలు--దొనకొండ కొత్త రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ మార్గం పారిశ్రామిక, సరుకు రవాణా అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే మార్కాపురం--ఒంగోలు మార్గం సాధ్యాసాధ్యాలు, వ్యయం, ప్రయాణికుల అవసరాలు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం వంటి అంశాలపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలి అన్నది ప్రజల డిమాండ్.

**రైల్వే అంటే కేవలం ప్రయాణం కాదు..**

రైల్వే లైన్ వస్తే ప్రయాణ సౌకర్యంతో పాటు మార్కెట్ పరిధి పెరుగుతుంది. సరుకు రవాణా ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు, పర్యాటక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంటుంది.

అందుకే పశ్చిమ ప్రకాశానికి రైల్వే అనుసంధానం ఒక రవాణా సౌకర్యం మాత్రమే కాదు.. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి మౌలిక వసతి.

**ఇది రైలు మార్గం కాదు.. అభివృద్ధి మార్గం..**

ఒంగోలు--దొనకొండ మార్గంపై సర్వే జరుగుతున్న సమయంలో మార్కాపురం--ఒంగోలు మార్గం సాధ్యాసాధ్యాలను కూడా కేంద్రం సమగ్రంగా పరిశీలించాలి.ఏ మార్గం ఎక్కువ మందికి ఉపయోగపడుతుంది,ఏ మార్గం రైతు పంటకు మార్కెట్‌ను చేరువ చేస్తుంది,ఏ మార్గం జిల్లా కేంద్రాన్ని బలమైన రైల్వే నెట్‌వర్క్‌తో కలుపుతుంది, ఈ ప్రశ్నలకు సమగ్ర అధ్యయనం ద్వారా సమాధానం రావాలి. మార్కాపురం నుంచి పట్టాలు కదిలితే.. పశ్చిమ ప్రకాశం అభివృద్ధి దిశ కూడా మారే అవకాశం ఉంది.ఇది కేవలం రైల్వే లైన్ కాదు,పశ్చిమ ప్రకాశం భవిష్యత్తుకు పట్టాలు వేసే ప్రయత్నం.

## ప్రభుత్వం ఆలోచించాలి..



గైకోటి వెంకట రవి

**సెక్రెటరి, ది మార్కాపురం జిల్లా ప్రయాణికుల సంఘం**

**దొనకొండ -- ఒంగోలు 119.6 కి.మీ ప్రాజెక్ట్ డీపీఆర్ (డి పి ఆర్)ను తక్షణమే పునఃసమీక్షించాలి.**

**రైల్వే అలైన్‌మెంట్‌ను మార్కాపురం,పొదిలి, ఒంగోలుమీదుగా మార్చాలి.**

**హైదరాబాద్,శ్రీశైలం, మార్కాపురం నూతన బ్రాడ్ గేజ్ లైన్ సర్వేను వేగవంతం చేసి త్వరితగతిన ఆమోదించాలి.**

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# 4 కోట్లతో... 3 తారురోడ్లు

*-నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి*

*-లింగసముద్రం మండలంలో సందడిగా కార్యక్రమాలు*







**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 4**

జగన్ ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలే. ఒక్క తట్ట కూడా మట్టి వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామీణ రోడ్లకు మోక్షం కలిగింది. పల్లె పండుగ 1,2, పీఎంజిఎస్ వై, నాబార్డ్, ఆర్ అండ్ బి తదితర నిధులతో ఈ రెండున్నర సంవత్సరాలలో నియోజకవర్గంలో 42.64 కోట్లతో 17 తారురోడ్లను నిర్మించాం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా 6 గ్రామాలకు కొత్తగా తారురోడ్లు నిర్మించేందుకు 9.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగా.... లింగసముద్రం మండలంలో == పాలెంలో పిఎంజిఎస్ వై కింద 1.15 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు, 1.97 కోట్లతో నిర్మించనున్న విశ్వనాధపురం - గంగపాలెం తారురోడ్డు, 90 లక్షలతో నిర్మించనున్న మేదరమిట్లపాలెం - జంగాలపల్లి తారురోడ్డు పనులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు గారు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇన్నేళ్ల కష్టాలు తొలగేలా, తమ గ్రామాలకు కొత్తగా రోడ్లు ఏర్పాటు చేయబోతున్నందుకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ, మూడు కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మేళ తాళాలతో నాగేశ్వరరావుకు స్వాగతం పలికారు. ప్రతి గ్రామానికి తారురోడ్డు, అంతర్గతంగా సిసి రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడమే నా లక్ష్యం. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పల్లెల్లో కళ వచ్చింది. గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో పనిచేస్తున్నాను అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శంకుస్థాపనల అనంతరం మూడు చోట్ల ప్రజల నుంచి ఎమ్మెల్యే గారు అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారంపై అధికారులకు అక్కడే ఆదేశాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మూడు గ్రామాలలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు వివరించారు. అంతకుముందు ఆర్ఆర్ పాలెం వద్ద పొగాకు నారుమడిలో పనిచేస్తున్న కూలీలతో ఎమ్మెల్యే ముచ్చటించారు. వారి వద్దకు స్వయంగా వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను దాదాపు నెరవేర్చాం. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పార్టీలకు అతీతంగా పథకాలు చేరుతున్నాయి. ఇవన్నీ గుర్తుపెట్టుకుని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు సహకారం అందించి గెలిపించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, గ్రామ పార్టీల అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, ఉన్నం రమేష్, కూరపాటి విజయ భాస్కర్, త్రోవగుంట వెంగళరావు, పార్టీ నాయకులు కిలారి రవి, కేతినేని మహేష్, వీరభద్రయ్య, బొల్లినేని నాగేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, కూరపాటి శ్రీను, సోంపల్లి మనోహర్, రాజారపు మాలకొండయ్య, పల్లపోతు వెంగళరావు, కిలారి కొండయ్య, అడపా రంగయ్య, నరసయ్య, కొండపనాయుడు, పూరిమిట్ల మాల్యాద్రి, గొర్రెపాటి సాంబయ్య, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పట్టాలపై గ్రామస్తులతో బొబ్బూరి రమేష్ చర్చ

## అర్హులైన కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 4**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటి పట్టాలు అందించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని సి ఎస్ పురం శివాలయ ప్రాంగణంలో గ్రామస్తులతో ఇంటి పట్టాల పంపిణీ అంశంపై ఆయన చర్చించారు.ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇంటి పట్టాలు అందించే ప్రక్రియలో ఎలాంటి అర్హత కలిగిన కుటుంబం కూడా నష్టపోకుండా అందించేందుకు అందరూ భాగస్వాములై గుర్తించాలన్నారు. కనిగిరి నియోజకవర్గంలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అర్హులకు చేరేలా అధికారులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారని, ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలం కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామంలో అర్హులైన కుటుంబాలను ప్రభుత్వానికి అందించడం ద్వారా పట్టాల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేందుకు తమ వంతు సహకారం అందించాలన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, బత్తుల వెంకటాద్రి, బోయిన మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య నగర్‌లో నీటి కుళాయిల లీకేజీకి మరమ్మత్తులు

**మరమ్మతులు చేయించిన జిల్లా బిజెపి అధ్యక్షుడు పీవీ కృష్ణారావు**

**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 04**

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏకలవ్య నగర్ కాలనీ 1వ లైన్ లో నాలుగు నీటి కొళాయిలు లీకై, నీరు వృథాగా పోతూ సరిగా పనిచేయడం లేదని స్థానిక మహిళలు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించిన జిల్లా అధ్యక్షుడు పివి కృష్ణారావుతో పాటు స్థానిక బీజేపీ నాయకులు మున్సిపల్ డీఈ మేడం దృష్టికి తీసుకువెళ్లి, వార్డు ప్లంబర్ కు సమాచారం ఇచ్చి తక్షణమే మరమ్మత్తులు చేయించేందుకు ఏర్పాటు చేశారు.నీటి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేసిన బీజేపీ నాయకులకు కాలనీ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.



# గురువు సమాజానికి దిక్సూచి - ఎమ్మెల్యే దామచర్ల

## - అప్సా ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 04**

సమాజంలో గొప్ప పౌరులను తయారుచేసే శిల్పులు ఉపాధ్యాయులే అని ఉత్తమ సమాజ నిర్మాణానికి దిక్సూచిగా మార్గనిర్దేశం చేసే గురువు ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్ టి ఆర్ కళాక్షేత్రం లో ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ (అప్సా)ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలోని 43 విద్యాసంస్థలకు చెందిన 132 మంది టీచర్లకు ఎమ్మెల్యే జనార్దన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్షురాలు ఈ వి ఎస్ లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సమాజంలో అత్యంత గౌరవం కలిగిన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన వారికి మరింత భాధ్యత పెరుగుతుందని తెలిపారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్య రాజు, ఓనుడా చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, మండల విద్యాశాఖాధికారి తిరుపతి కిషోర్ బాబు , సరస్వతి కాలేజీ రమణారెడ్డి, హర్షిణి కళాశాల గోరంట్ల రవికుమార్, సంకల్ప పకీర్ రెడ్డి , మాంటిస్సోరి ప్రకాష్, అప్సా జిల్లా అధ్యక్షులు గేరా అజయ్ కుమార్ , ఆంధ్రా శ్రీనివాస్, రేస్ కాలేజ్ రమేష్, జి యన్ ఆర్ మెడికల్ అకాడమీ నాగేశ్వరరావు, పేస్ జూనియర్ కాలేజీ నాగేశ్వరరావు , మైత్రేయి అకాడమీ రామారావు , శ్రీ గౌతమ్ జూనియర్ కాలేజీ రఘునాథ్, సీబీ మైకేల్, జాల్ రెడ్డి, శివప్రసాద్, రామిరెడ్డి, బొమ్మల శ్రీనివాసరావు, జేబీనా మేడం, శ్రీరాములు రెడ్డి, గద్దగుంట సుబ్బారావు, గీతాంజలి శ్రీనివాసులు, సౌజన్య, నోబుల్ , ఎం. శేఖర్ బాబు, యేసుపాదం, జమీర్, కోటి తదితరులు పాల్గొన్నారు.






# రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను సమైక్యంగా అడ్డుకోవాలి!

## -పల్లిపాలెంను నిర్వాసితుల జాబితాలో చేర్చాలి -18 ఏళ్లు నిండిన అర్హులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు తక్షణమే ఇవ్వాలి

### - సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు






**కందుకూరు, పెన్ పవర్ అక్టోబర్ 4:**
ప్రభుత్వ ప్రజాధనంతో నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను ప్రజలంతా సమైక్యంగా అడ్డుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. పోర్టు నిర్మాణం వల్ల భూములు, ఇళ్లు, జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు, మత్స్య కార్మికులు, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కందుకూరులోని త్యాగరాజ స్వామి దేవాలయ మందిరంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకాశం జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు వందలాది మంది మత్స్యకారులు, మత్స్య కార్మికులు హాజరయ్యారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

**ప్రభుత్వ ఆధీనంలోనే పోర్టు నిర్వహించాలి...**
రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు సుమారు 85 శాతం పూర్తయ్యాయని, ఇప్పటికే రూ.4 వేల కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు చేసిన నేపథ్యంలో పోర్టును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సమంజసం కాదని నర్సింగరావు అన్నారు. పోర్టు ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే స్థానికుల హక్కులు, ఉపాధి అవకాశాలకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థలు లాభాలకే ప్రాధాన్యత ఇస్తాయని, స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితిని మార్చేందుకు రామాయపట్నం పోర్టు దోహదపడాలని, దాని ద్వారా ఏర్పడే అభివృద్ధి ఫలాలు స్థానిక ప్రజలకే అందాలని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు సాగిన తరహాలో రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను కూడా ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

**నిర్వాసితులకు ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలి....**
పోర్టు నిర్మాణం కారణంగా భూములు, ఇళ్లు, జీవనోపాధి కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు న్యాయమైన పరిహారంతో పాటు పునరావాసం, పునర్నిర్మాణ ప్యాకేజీలు (ఆర్అండ్ఆర్) ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని సదస్సు డిమాండ్ చేసింది. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతీ యువకులకు 2026 జనవరి నాటికే అమలు చేయాల్సిన ప్రత్యేక ప్యాకేజీలు ఇప్పటికీ అందకపోవడం అన్యాయమని పేర్కొంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే ప్యాకేజీలు మంజూరు చేయాలని తీర్మానించింది.

పోర్టు నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న పల్లిపాలెం గ్రామాన్ని నిర్వాసితుల జాబితాలో చేర్చాలని సదస్సు కోరింది. అధికారులు గ్రామాన్ని సందర్శించి, ప్రజలతో చర్చించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. పోర్టు నిర్మాణం కోసం చేవూరు దళితుల నుంచి సేకరించిన 13 ఎకరాల 40 సెంట్ల భూమికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది.

**సముద్ర కోత నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి...**
రామాయపట్నం పరిసర గ్రామాల్లో సముద్ర కోత పెరుగుతుండటం, సముద్రం గ్రామాల వైపు ముందుకు వస్తుండటంపై సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులకు గల కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని, నిపుణులు, సంబంధిత అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి శాశ్వత సముద్ర రక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. ముంపు ప్రమాదం ఉన్న కుటుంబాలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఇళ్ల స్థలాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసింది.

**ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి డిమాండ్...**
స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు రామాయపట్నం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ను తక్షణమే నిర్మించాలని సదస్సు కోరింది. తుఫానులు, సముద్ర అలజడుల సమయంలో తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారులకు ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది. పోర్టు అభివృద్ధి వల్ల జీవనోపాధి కోల్పోయే మత్స్యకారులు, మత్స్య కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రకాశం జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతకు పోర్టులో ఉద్యోగాలు కల్పించి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యలపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి రామాయపట్నం ప్రాంతాన్ని సందర్శించాలని, మత్స్యకారులు, మత్స్య కార్మికులు, నిర్వాసితులతో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సదస్సు తీర్మానించింది. ఈ సదస్సులో మత్స్యకారులు, మత్స్య కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎం. రమేష్, ఐఎఫ్టీయూ నాయకుడు ఆర్. మోహన్, బీసీ సంఘం నాయకుడు మిరియం శ్రీనివాసరావు, ఎల్ఐసీ సీనియర్ నాయకుడు బెజవాడ శివయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ మజుందార్, జిల్లా నాయకులు గౌస్, జి.వి.బి. కుమార్, కాపు సంఘం నాయకుడు రాములు, రాసాని సుధాకర్, మత్స్యకారుల నాయకురాలు ప్రభావతి, ఐద్వా నాయకురాలు ఎస్.కె. మల్లిక, లలిత్ కుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ కొట్టే వెంకయ్య, ఎస్టీ గౌస్ బాషా, డి.ఎం. రాయుడు, గుట్టి మల్లికార్జున, మల్లవరపు అంకమ్మరావు, ఐద్వా నాయకులు సుంకర విజయలక్ష్మి, కే. ప్రసన్న, ఎస్.కే. అస్మా తదితరులు పాల్గొన్నారు.

# పదవీ కాలం పూర్తయిన జడ్పీటీసీ, ఎంపీపీలకు ఘన సన్మానం

### -ఒంగోలు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సత్కారం







**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 4**
కందుకూరు నియోజకవర్గ పరిధిలో పదవీ కాలం పూర్తిచేసుకున్న జడ్పీటీసీలు, ఎంపీపీలను ఒంగోలులోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. సన్మానం అందుకున్న వారిలో వలేటివారిపాలెం జడ్పీటీసీ ఇంటూరి భారతి, హరిబాబు, కందుకూరు జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య శ్రీనివాసరావు, కందుకూరు ఎంపీపీ ఇంటూరి సుశీల మాధవరావు, లింగసముద్రం ఎంపీపీ పెన్న కృష్ణయ్య, గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్, మాజీ టీటీడీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రజాప్రతినిధులను సత్కరించారు.

# డాక్టర్ చంద్రశేఖర్ గుప్తాను అభినందించిన డిఎస్పీ



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 4**
ఇటీవల వెలువడిన నీట్ పిజీ ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 509 సాధించిన ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్ గుప్తాని కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం, కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా డీఎస్పీ కార్యాలయంలో శాలువాతో సన్మానించి, స్వీట్ తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పిజీ నీట్ 509 ర్యాంక్ సాధించడం గొప్పవిషయమని అన్నారు. మంచి ర్యాంకు సాధించి మీ తల్లిదండ్రులకు,కందుకూరు మంచి పేరు తెచ్చావాని కొనియాడారు. ఇలాగే బాగా చదివి పీజీ పూర్తి చేసి సమాజానికి, పేదలకు మరింత సేవ చేయాలని డిఎస్పి ఆకాంక్షించారు. ఎంతో ఇష్టపడి కష్టపడి చదివితేనే ఇలాంటి మంచి ర్యాంకు వస్తుందని, ఎటువంటి కోచింగ్ లేకుండా ఆల్ ఇండియా ర్యాంక్ 509 సాధించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. మంచి డాక్టర్ గా సమాజానికి సేవలు అందించాలని సిఐ అన్వర్ భాష ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ ను అభినందించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు: పెన్ పవర్ అక్టోబర్ 04**
గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ . వి రమణబాబు ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేకశీగా అభినందించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ మున్సిపాలిటీ – 2026 రాష్ట్రస్థాయి అవార్డుకు గిద్దలూరు మున్సిపాలిటీ ఎంపిక కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పారిశుధ్యం ఇంటి చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత కార్యక్రమంలో చేపట్టిన చర్యలకు గుర్తింపు గా ఈ అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు

# 35 రూపాయలకే కిలో ఉల్లిపాయలు

### -కందుకూరులో అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 4:**
ఎల్ నినో ప్రభావంతో నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని తక్కువ ధరకే ప్రజలకు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. బహిరంగ మార్కెట్లో కిలో ఉల్లిపాయల ధర 60–65 రూపాయల వరకు ఉండగా సబ్సిడీపై కేవలం 35 రూపాయలకే అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కందుకూరు రైతు బజార్లో ఏర్పాటు చేసిన ఉల్లిపాయల అమ్మకం కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. పెరుగుతున్న ధరల ప్రభావం పేదలపై పడకుండా, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అంతకుముందు రైతు బజార్ అధికారులు, స్థానిక నేతలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ రాయపాటి సుభాషిణి శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఎ.డి వరలక్ష్మి, ఎన్ఫోర్స్మెంట్ డి.టి విజయ్ భాస్కర్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ స్వరూపారాణి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఏఎంసీ డైరెక్టర్ కొత్తూరు సుధాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, చుండూరి శ్రీను, షేక్ సలాం, సయ్యద్ రూబీ, షేక్ నజీర్, జియావుద్దీన్, మురారిశెట్టి వెంకట సుబ్బారావు కూనం నరేంద్ర ఇతర నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం

### ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఘన సత్కారం



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 04:**
ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందిస్తూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం లభించింది. గిద్దలూరు హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్‌గా ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిద్దలూరులోని విశ్వభారతి హైస్కూల్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు చేతుల మీదుగా డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు గురుబ్రహ్మ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, విద్యాబోధనతో పాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్య, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు డాక్టర్ పిచ్చయ్య చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఎన్‌సీసీ అధికారిగా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడం వంటి అంశాల్లో ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని సహచర ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురుబ్రహ్మ పురస్కారం అందుకున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను సహచర ఉపాధ్యాయులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ పురస్కారం విద్యార్థుల కోసం మరింత బాధ్యతతో పనిచేసేందుకు తనకు ప్రేరణనిస్తుందని డాక్టర్ మొర్రి పిచ్చయ్య తెలిపారు.

# 35 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు

**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 4**
మండల వ్యవసాయాధికారి సజ్జ మనోహర్ అక్టోబర్ 5వ తేదీ నుంచి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 35 శాతం సబ్సిడీపై బయోమెట్రిక్ విధానంలో శనగ విత్తనాల పంపిణీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుందని, కావున శనగ పంట వేసే ప్రతి ఒక్క రైతు రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సజ్జ మనోహర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, ఆధార్ కి లింక్ అయిన మొబైల్ నెంబర్ తీసుకొని రైతుసేవ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఎకరాకు 40 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు సబ్సిడీ పై విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. జేజీ–11 రకం పూర్తి ఖరీదు క్వింటా రూ.9,000 కాగా సబ్సిడీ రూ.3,150 పోను, రైతు రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

# పదవులు ముగిసిన ప్రజాసేవలో ముందుండాలి

### వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 4**
గత అయిదు సంవత్సరాలు గా వివిధ హోదాలలో రాజకీయ పదవులు చేపట్టి, తమ తమ మండలాలలో ప్రజలకు సేవలు అందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, పదవులు ముగిసిన ప్రజాసేవలో ముందుండాలని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఒంగోలులోని వైస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో తాజా మాజీ జడ్పీటీసీ,ఎంపీపీ లకు ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంకు చిరునామాగా నిలిచిన వైస్సార్సీపీ ప్రభుత్వంలో, జగనన్న నేత్రుత్వంలో పనిచేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఎన్నో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు జడ్పీటీసీ, ఎంపీపీ లు నియోజకవర్గంలో చేపట్టారని ఆ సేవలు గుర్తుండి పోతాయన్నారు. కార్యక్రమం లో యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు, దోర్నాల, పుల్లలచెరువు మండలాల జడ్పీటీసీలు చేదురి విజయ్ భాస్కర్,మాకం జాన్ పాల్,ఏరువా చలమారెడ్డి, లత భాయ్ చంద్ర నాయక్,వాగ్గే నాయక్,జిల్లా కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సాబీర్ బాషా,ఎంపీపీ లు దొంత కిరణ్ గౌడ్, ఆళ్ళ సుబ్బమ్మ,, గుమ్మా పద్మజ యల్లేష్ యాదవ్, మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జిగా శ్రీపతి ప్రకాశం నియామకం




**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 04**
గుంటూరు జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి గా శ్రీపతి ప్రకాశం ను ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియమించారు. తనకు గుంటూరు జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి గా నియమించినందుకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టాలి

## ఎస్పీ పంకజ్ కుమార్ మీనా





**మార్కాపురం(స్టాఫ్ రిపోర్టర్)పెన్ పవర్ అక్టోబర్ 04**

రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలీసు అధికారులను ఆదేశించారు.ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎన్నికల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలపై పూర్తి సమాచారం స్థానిక ఎస్ఐలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గత ఎన్నికల్లో గొడవలు, ఘర్షణలు జరిగిన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా గుర్తించి, కేసులు నమోదైన గ్రామాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.పాత రౌడీషీటర్లు, పాత నేరస్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు నిరోధక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ, నిఘా పెంచాలని, చిన్న వివాదాలు పెద్ద ఘర్షణలుగా మారకుండా ముందే పరిష్కరించాలన్నారు.

ప్రజలకు పోలీసులపై నమ్మకం కలిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సమన్వయంతో పనిచేసి మార్కాపురం జిల్లాను ఎన్నికలు ప్రశాంతంగా జరిగిన జిల్లాగా నిలపాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, కనిగిరి ఇన్‌ఛార్జ్ డీఎస్పీ శ్రీధర్ తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఒంగోలులో విస్తరించిన అమెజాన్ నౌ

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 04**

అమెజాన్ తన అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ సేవ అమెజాన్ నౌను భారతదేశవ్యాప్తంగా 120కి పైగా నగరాలకు వేగంగా విస్తరించినట్లు ప్రకటించారు. విశాఖపట్నం, ఒంగోలు, కర్నూలు, రాజమండ్రి, నరసరావుపేట, ప్రొద్దుటూరు, తెనాలి, ధర్మవరం, నంద్యాల, తిరుపతి, గుంటూరు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురంలుఉన్నాయి. కేవలం రెండు వారాల్లోనే ఈ సేవ పరిధి రెట్టింపైంది. అమృత్సర్, అబోహర్, జలంధర్, అంబాలా, మంగళూరు, మణిపాల్, వైజాగ్, కొచ్చి, చంగనస్సేరి, భువనేశ్వర్, కార్వార్ వంటి నగరాల్లోని వినియోగదారులు ఇప్పుడు అమెజాన్ నౌ ద్వారా నిమిషాల్లోనే డెలివరీలు అందుకుంటున్నారు. ఈ సేవ పదుల వేల సంఖ్యలో రోజువారీ నిత్యావసర వస్తువుల విస్తృత ఎంపికను అందిస్తోంది. కిరాణా సరుకులు (పండ్లు, కూరగాయలు, ఫ్రోజెన్ ఫుడ్తో సహా), పర్సనల్ కేర్, ఫ్యాషన్, బ్యూటీ నుంచి చిన్న గృహోపకరణాలు, హోమ్, కిచెన్ ఉత్పత్తుల వరకు మరెన్నో. దాదాపు 800 మైక్రో-ఫుల్ఫిల్మెంట్, అర్బన్ ఫుల్ఫిల్మెంట్ కేంద్రాల నెట్వర్క్ ద్వారా ఈ ఆర్డర్లను పూర్తి చేస్తున్నారు. ఈ పండుగ సీజన్లో విస్తరణను కొనసాగిస్తూ అత్యంత వేగవంతమైన డెలివరీతో అత్యంత విస్తృతమైన ఉత్పత్తుల ఎంపికను అందించేందుకు మేము ఎదురు చూస్తున్నామని అమెజాన్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎవ్రీడే ఎసెన్షియల్స్, హర్ష్ గోయల్ తెలిపారు.

# పొనుగుపాటి సేవలు సదా స్మరణీయం

## - ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 04**

ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి పునాదులు వేసిన మహానుభావుడు ఒంగోలు మాజీ శాసనసభ్యులు స్వర్గీయ పొనుగుపాటి కోటేశ్వరరావు అని వారు పేద ప్రజలకు, ఒంగోలు నగర అభివృద్ధికి చేసిన సేవలు సదాస్మరణీయమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. స్వర్గీయ పొనుగుపాటి కోటేశ్వరరావు 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక అద్దంకి బస్టాండ్ లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నగర అభివృద్ధితో పాటు ఆర్టీసీ డిపో, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టిన వ్యక్తి అని అన్నారు. అలాంటి వారిని ప్రజలు వారి హృదయాలలో గుర్తు పెట్టుకుంటారని వారి ఆశయాలను ప్రజలు ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. పొనుగుపాటి కోటేశ్వరరావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వై.వి సుబ్బారావు, నగర టిడిపి అధ్యక్షులు బండారు మదన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రధానం



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 04**

గాంధీ జయంతిని పురస్కరించుకుని అవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చీదెళ్ల లక్ష్మణరావు మాట్లాడుతూ మూడు మండలాల పరిధిలో 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, 32 మందికి బహుమతులు అందజేశామని తెలిపారు. వ్యాసరచన సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి సయ్యద్ అస్మా (సాయి బాలాజీ హైస్కూల్), ద్వితీయ ఎస్.కె.ఉస్మాన్ (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్), తృతీయ ఎం.నాగాంజలి (సాయి చైతన్య) సాధించారు. జూనియర్ విభాగంలో సాదియా, ప్రిన్స్, పావని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. అలాగే చిత్రలేఖనంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి విభాగంలో 10 కన్సోలేషన్ బహుమతులు కూడా ఇచ్చారు. విజేతలకు మెమెంటో, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అవోపా సెక్రటరీ రాచపూడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ మార్కాపురం అవోపా చేస్తున్న విద్యా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ట్రెజరర్ గొర్రె అనంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ రామారావు, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, చలమయ్య, కృష్ణమూర్తి, ఆదినారాయణ శెట్టి, కేశవరావు, శ్రీనివాసులు, ఓం సాయి వికాస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ హర్షిణి విద్యార్థుల ఆధిపత్యం



పీర్ల.అఫ్రీద్ | జే హేమంత్ రాజ్ | షేక్.రిషిక | కె.స్పందన | ఎస్.భారతి | సౌమ్యరెడ్డి

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 04**

శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం -- రెండవ సెమిస్టర్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల విజయానికి అధ్యాపకుల కృషి, మార్గదర్శకత్వం మరియు కళాశాలలో ఉన్న ఉత్తమ విద్యా వాతావరణమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. సెక్రటరీ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ఎండీ గోరంట్ల హర్షిత్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ దాది ఆంజనేయులు, జీఎం ఆర్ల శివరాం, ప్రిన్సిపల్ ఎం. నాగేంద్ర, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని టాపర్స్‌ను సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**కోర్సుల వారీగా టాపర్స్ వివరాలు**

బీఎస్సీ బోటనీ :: ప్రథమ స్థానం -- సారిక భారతి -- గ్రేడ్ 9.25

బీఎస్సీ మ్యాథ్స్ :: ప్రథమ స్థానం -- సౌమ్య రెడ్డి -- గ్రేడ్ 9.17

బీసీఏ :: ప్రథమ స్థానం -- షేక్ రిషిక -- గ్రేడ్ 9.16

బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ :: ప్రథమ స్థానం -- కర్నాటి స్పందన -- గ్రేడ్ 8.98

బీకాం కంప్యూటర్స్ :: ప్రథమ స్థానం - పిడూరి శ్రీ సాయి సుమనస్విని -- గ్రేడ్ 8.92

బీఎస్సీ కంప్యూటర్ సైన్స్: ప్రథమ స్థానం - జమ్మలమూడి మానస - గ్రేడ్ 8.67

బీబీఏ :: ప్రథమ స్థానం -- జంగా జాకబ్ హేమంత్ రాజ్ -- గ్రేడ్ 8.53

బీఏ :: ప్రథమ స్థానం -- షేక్ పీర్లా అఫ్రీద్ -- గ్రేడ్ 8.45.

# ఆరోగ్యవంతమైన సమాజం కోసం వైద్యులు తమ వంతు సహకారం అందించాలి

## - ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 04**

ఆరోగ్యవంతమైన సమాజం కోసం వైద్యులు తమ వంతు సహకారం అందించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోరారు. ఏ పి ఆర్ ఎస్ ఎస్ డి ఐ - 2026 కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే జనార్దన్ విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో వైద్యులకు ఎంతో విలువ, గౌరవం ఉన్నాయన్నారు. మీరు అందించే సూచనలు క్షేత్ర స్థాయిలోకి వెళితే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. 90 ఏళ్లు దాటిన వారిలో డయాబెటిస్, బిపి వంటివి లేకుండా ఆరోగ్యంగా ఉంటున్నారని, ప్రస్తుత కాలంలో 15 ఏళ్ల పిల్లల్లో కూడా డయాబెటిస్ ఉంటుందన్నారు. ఇలాంటి సెమినార్ ల ద్వారా చిన్న వయస్సులో వచ్చే దీర్ఘకాలిక సమస్యలను నిలువరించేందుకు చర్చించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని దామచర్ల జనార్దన్ రావు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ సి డి సి డి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తమ వైద్య బృందాలు వెళ్ళి బిపి, షుగర్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వైద్యం ఒక్కటే కాకుండా ఆహార అలవాట్లు, వ్యాయామం చేయడం ద్వారా కొన్ని రకాల వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఒంగోలులో ఆర్ ఎస్ ఎస్ డి ఐ ద్వారా మంచి వర్క్ షాప్ జరిగినట్లు చెప్పారు.




ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు నుండి ఎంతో అనుభవం కలిగిన వైద్యులు పాల్గొని విలువైన సూచనలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్ ఎస్ ఎస్ డి ఎస్ లో మెంబర్ షిప్ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఆర్ ఎస్ ఎస్ డి ఎస్ ప్రెసిడెంట్ వెంకటరమణరెడ్డి, ఆల్ ఇండియా ఈ సి మెంబర్ విజయ్ కుమార్, ఏపీ ఏం సి వైస్ ఛైర్మన్ సుబ్బానాయుడు, అబ్జర్వర్ జయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 4**

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు నారాయణస్వామికి ప్రీతికమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయాలను అనుసరించి శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్ తో పాటు శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, అలంకరించి వివిధ రకాల పూలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం గోశాలలో గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు తదుపరి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించారు మేళతాళాల వేదమంత్రోత్సవాలతో నారాయణస్వామి నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు ఈ కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, ముడిమాల నారాయణ రెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# వెలుగొండ నిర్వాసితుల జాబితా వెంటనే ప్రకటించాలి

## సిపిఎంజిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య డిమాండ్



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 04**

వెలుగొండ నిర్వాసితుల అర్హుల జాబితాను వెంటనే ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో జరిగిన నిర్వాసితుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 28న మంత్రి నిమ్మల రామానాయుడు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలుగా మిగిలాయని ఆరోపించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ డబ్బులు ఇప్పటికీ ఖాతాల్లో పడలేదని, ప్రకటిస్తున్న జాబితాలో అర్హుల పేర్లు గల్లంతవుతున్నాయని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మిస్ అయిన కుటుంబాల జాబితాను నిష్పాక్షికంగా ప్రకటించి, యువతీ యువకులకు రెండు లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

# గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 4**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో శనివారం పోలీసులు కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో గ్రామంలోని అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాంటి వాటిని ఎవరైనా సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సిఐ,వలేటివారిపాలెం ఎస్సై ప్రేమ్ కుమార్, గుడ్లూరు, లింగసముద్రం ఎస్సై లు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాలకొండ నుండి సోమనాథ్ యాత్రకు 59 మంది భక్తులు

**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 04**

హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నుండి 1008 మంది సేవకులు, వాలంటీర్లు ఈ యాత్రలో పాల్గొననున్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మాలకొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుండి 59 మంది సేవా భక్తులు ఈ యాత్రకు బయలుదేరనున్నారు. భక్తుల సౌకర్యార్థం మాలకొండ దేవస్థానం నుండి విజయవాడ వరకు రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. అక్కడి నుండి రైలు మార్గంలో గుజరాత్ లోని సోమనాథ్ క్షేత్రానికి చేరుకుంటారు. భక్తులు సోమనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారని దేవస్థానం ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇటువంటి యాత్రలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. యాత్రికులకు రవాణా, వసతి, భోజనం, భద్రత విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. యాత్ర సజావుగా, సౌకర్యవంతంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని, భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.



# గుడ్లూరులో జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం

## పార్టీ బలోపేతంపై చర్చించిన జనసైనికులు.

**గుడ్లూరు, పెన్ పవర్, అక్టోబరు 04:**
జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళే లక్ష్యంతో కందుకూరు నియోజకవర్గంలో నేడు స్థానిక జనసేన నాయకులు గుడ్లూరు మండల కేంద్రముగా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. జనసేన నాయకులు భైరవరపు రాజశేఖర్, అన్నంగి చలపతి, అనిమిశెట్టి మాధవరావు, మూలగిరి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ ఆత్మీయ సమావేశం ఉత్సాహంగా జరిగింది. ముందుగా పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలతో సత్కరించారు. పవన్ కల్యాణ్ పార్టీ స్థాపించిన మొదలు నేటి వరకు చేసిన విప్లవాత్మక నిర్ణయాలు మూలంగా ప్రజలకు మేలు జరిగిన విధానాన్ని ఈ ఆత్మీయ సమావేశం లో చర్చించుకున్నారు. నిన్నటి సార్వత్రిక ఎన్నికల ముందు కూటమిని ఏర్పాటు చేసింది మొదలు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం గా వివిధ శాఖామాత్యులుగా పవన్ కల్యాణ్ పనితీరు సాధించిన విజయాలు పాలనలో పారదర్శకత జవాబుదారీతనం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. స్థానికంగా జనసేన ఉనికిని కాపాడుకుంటూ పార్టీ బలోపేతం కోసం స్థానిక జనసైనికులు తమ వంతు కృషి బలంగా చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు మరియు గత వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ జనసేన జెండా ఆవిష్కరణలు కావించి పలువురిని పార్టీలోకి ఆహ్వానించి జనంలోకి జనసేన కార్యక్రమాలు ద్వారా పార్టీ బలోపేతం కోసం స్థానిక జనసైనికులు కృషి చేసిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. అలాగే నిన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గంలో గత 20 ఏళ్ళుగా



ఓటమి పాలైన టీడీపీకి పవన్ కల్యాణ్ గారి ఆదేశాలు అనుసరించి జనసైనికులు మెగా అభిమానులు మద్దతు తెలపడం తో కందుకూరులో కూటమి ప్రభుత్వం భారీ విజయం సాధించింది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. అలాగే రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ విజయాలు పవన్ కల్యాణ్ ఆశయాలు మరింత ప్రజల్లోకి తీసుకెళ్ళాలిసిన ఆవశ్యకత ఉందన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి మెచ్చి ఇతర



పార్టీల నుంచి వచ్చే సామర్థ్యం కలిగి నాయకత్వ లక్షణాలు ఉన్న వారికి జనసేన సముచిత స్థానం కల్పించడానికి సిద్ధం గా ఉంటుంది అన్నారు. నాయకుడుగా సమాజంలో మంచి జరగాలి అని అనుకునే వారికి జనసేన మంచి వేదిక. మాకేంటి లాభం అని అనుకునే వారు కాకుండా ప్రజాహితమే ధ్యేయంగా పవన్ కల్యాణ్ గారి ఆశయాలు నచ్చి మెచ్చి వచ్చే వారికి కొత్త పాత తేడా లేకుండా సమర్థులకు గుడ్లూరు మండల జనసేన సముచిత స్థానం ఇస్తుందని తెలిపారు. ఇలాంటి పలు అంశాలను జనసైనికులు ముక్తకంఠంతో ఏకవాక్య తీర్మానం గా ఆమోదించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాలు నుంచి జనసైనికులు గుండెమడుగుల భాస్కర్, సన్నిశెట్టి గిరిబాబు, కంతా హజరత్తయ్య, పసుపులేటి గోపి, కొనికి రాజేష్, నాగభూషణం, గౌడపేరు శివాజీ, నూతలపాటి శివరాం, కాకు మనోహర్, కుంచాల అంకమరావు, షేక్ రహంతుల్లా, దన్యాసి శివ, తాటిపర్తి కోటి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో పోలీసుల విస్తృత తనిఖీలు





**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 4**
పొదిలిలో పోలీసులు విస్తృత పరీక్షలు నిర్వహించారు. పట్టణ శివారులోని పిచ్చిరెడ్డి తోట ప్రాంతంలో కార్డెన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా సోదరులు నిర్వహించడంతోపాటు అనుమానం ఉన్న ప్రతి కదలికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రాజేష్, ఎస్ ఐ సూరెడ్డి రాజేష్ తోపాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏబీఎం ఆస్తులను గురించి పరిరక్షణ



**దొనకొండ అక్టోబర్ 4 పెన్ పవర్**
మండల కేంద్రంలోని స్థానిక బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో చర్చ్ ఆస్తుల పరిరక్షణ విషయమై జరిగిన సమావేశంలో , హైకోర్టు అడ్వకేట్ ఎం ఎన్ ప్రసాద్ పాల్గొని ఈ ఆస్తుల విషయమై మాట్లాడారు . సర్వే నెంబరు 209/1, 210/3, 210/5,212/3,210/4,211,217,215/2,210/10.213/2 గల భూములు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన సిఎస్ నెశీ. 124/94 తీర్పు ద్వారా దొనకొండ ఏ బీ ఎమ్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ వారికి మాత్రమే అన్ని హక్కులు ఉన్నాయని, ఈ భూములను అన్యాక్రాంతంగా ఆక్రమించుకొని లావాదేవీలు జరుపుతున్న ఏబీఎఫ్ఎంఎస్ మరియు పిఎ బిసి వారికి ఎటువంటి హక్కులు లేవు అని తెలిపారు. కోర్టు జడ్జిమెంట్ ని ధిక్కరించి భూములను అన్యాక్రాంతం చేసిన 18 మందిపై మార్కాపురం జిల్లా కోర్టులో దావా వేసి ఉన్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ ఎండి సుధాకర్ సంఘ సెక్రటరీ ఎన్ సుధీర్ ట్రెజరర్ , స్టాండింగ్ కమిటీ సభ్యులు, పెద్దలు మరియు యవ్వనస్తులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి సాఫ్ట్ వాల్ పోటీలలో మాధురికి బంగారు పతకం

## ఘనంగా సత్కరించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల





**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 04**
సాఫ్ట్ వాల్ జాతీయస్థాయి గోల్డ్ మెడల్ ప్రకాశం జిల్లా ముళ్ళమూరు మండలం ఉమామహేశ్వర పురానికి చెందిన సిహెచ్ మాధురి సాధించింది. మహారాష్ట్ర లోని మహా సంభాజీ నగర్ లో జరిగిన సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలు పాల్గొనింది. గోల్డ్ మెడల్ సాధించిన మాధురిని స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఈటి పీ తిరుపతి స్వామి, కోచ్ త్రినాథ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జాతి స్థాయిలో మాధురి పథకాలు సాధించిందని ఈ నెలలో కడపలో జరిగే పోటీల్లో కూడా పాల్గొంటున్నారని ప్రకాశం జిల్లాకు మంచి బహుమతులు సాధించాలని కోరుతూ వారిని అభినందించారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది

## గిద్దలూరులో ఘనంగా ఉపాధ్యాయుల సత్కారం



**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 04**
సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను గిద్దలూరు పట్టణంలో ఘనంగా సత్కరించారు. ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు బి.యస్. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.యస్. నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు అందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగిస్తూ, విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే శక్తిమంతమైన పౌరులుగా తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు. ఉపాధ్యాయులను రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారాలతో సత్కరించాలనే గొప్ప సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తి నేటి తరం విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయుల త్యాగాలు, ధైర్యసాహసాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అజ్ఞానంలో ఉన్నవారిని జ్ఞానంతో తీర్చిదిద్ది, వారిని సమాజానికి శక్తిమంతమైన పౌరులుగా రూపొందించే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. తాను సాధించిన ప్రతి విజయానికి ప్రభుత్వ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులే ప్రధాన కారణమని తెలిపారు. ఒక మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను మార్కాపురం, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లోనే విద్యాభ్యాసం చేశానని గుర్తుచేశారు. ఫార్మా రంగంలో ప్రతిష్టాత్మకమైన యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా 35వ ఎడిషన్‌లో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ ఔషధాలపై తాను చేసిన పరిశోధనా పత్రం ప్రచురితం కావడం, అలాగే ఇప్పటివరకు 15 జాతీయ అవార్డులు సాధించడం వెనుక తన గురువుల ప్రోత్సాహం, ఆశీస్సులే ఉన్నాయని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎంతటి ఉన్నత స్థానాల్లో ఉన్నవారైనా ఉపాధ్యాయుల ముందు ఎప్పటికీ విద్యార్థులేనని, గురువుల పాదాలకు నమస్కరించడం తనకు ఎంతో గర్వకారణమని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట స్ఫూర్తితో గిద్దలూరు ప్రాంతం దేశ రక్షణ కోసం వేలాది మంది సైనికులను అందించిందని, ఆ వీరుడి దేశభక్తి, ధైర్యసాహసాలు, క్రమశిక్షణను నేటి తరం విద్యార్థుల్లో కూడా నింపాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తరగతి గదులు కేవలం పాఠాలు నేర్పే ప్రదేశాలు మాత్రమే కాకుండా.. దేశభక్తి, నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావం కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే పవిత్ర వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచంద సంస్థ చైర్మన్ శివారెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు డాక్టర్ జె.వి. నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, చిన్ని సేవా సంస్థ అధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాదుల్లా, కొమరోలు మండల విద్యాధికారి కావడి వెంకటేశ్వర్లు, విశ్వభారతి పాఠశాల యాజమాన్యం రంగస్వామిరెడ్డి, ఆదిలక్ష్మి తదితరులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 04**
పట్టణ శివారు ప్రాంతంలోని శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్ ను వివిధ రకాల పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో అర్చకులు విశేషంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమాలను ఆలయ సిబ్బంది వెన్నా శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు.

# ప్రతి కుటుంబానికి రెండు కేజీల ఉల్లిపాయలు

## ఒక కేజీ 35 రూపాయల చొప్పున విక్రయం

### కొత్తపట్నం బస్టాండ్ రైతు బజార్లో ఉల్లిపాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 04**
బహిరంగ మార్కెట్లో ఉల్లిధర అధికంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా కేజీ 35 రూపాయలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు అన్నారు. నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ లో గల రైతు బజార్లో ఉల్లిపాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. బియ్యం ధర పెరగటం, ఉల్లి ధర పెరుగుదల, టమోటా లాంటి వాటికి ధరలు పెరగటంతో ప్రజలు బహిరంగ మార్కెట్లో కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారని అందుకోసం జిల్లాలోని నాలుగు రైతు బజార్లలో బియ్యము ఉల్లిపాయలు విక్రయ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉంచామని అన్నారు. పొద్దుటూరులో ఉల్లిపాయలను దిగుమతి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆధార్ కార్డుతో లేక రైస్ కార్డుతో రెండు కేజీలు లెక్కన అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒనుడా చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకటరావు, డీఎస్ఓ పద్మశ్రీ, మార్కెటింగ్ ఏడి వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, ఏ శాండిల్య, కఫిల్ బాషా, కూటమి పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

## ఎంబీబీఎస్ చదువుకు రూ.85 వేల ఆర్థిక సాయం




**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 04**
పేదరికం ప్రతిభకు అడ్డు కాకూడదని మార్కాపురం లయన్స్ క్లబ్ మరోసారి నిరూపించింది. భగత్ సింగ్ కాలనీకి చెందిన ఎనిబెర స్టీవెన్సన్ నీట్ లో 1369 ర్యాంక్ సాధించి ముంబై గ్రాంట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. తండ్రి ప్రసాద్ ఆటో డ్రైవర్ కావడంతో ఫీజు చెల్లింపునకు ఇబ్బంది పడ్డాడు.విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కశెట్టి జగన్ బాబు క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, మిత్రుల సహకారంతో రూ.85 వేలు సమీకరించి ఆదివారం విద్యార్థికి అందజేశారు. ఇందులో మార్కాపురానికి చెందిన ఓ అజ్ఞాత దాత రూ.25 వేలు, ఒంగోలుకు చెందిన బొగ్గవరపు జయరామారావు, సరోజినీ దంపతులు రూ.10 వేలు అందించారు.ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి ప్రసాద్ కృతజ్ఞతలు తెలపగా, విద్యార్థి స్టీవెన్సన్ మాట్లాడుతూ ఆటో నడుపుతూ తనను చదివించిన తండ్రి రుణం తీర్చుకుంటానని, లయన్స్ క్లబ్ సాయం తనలో ఆత్మవిశ్వాసం పెంచిందన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు పేదరికంతో విద్యకు దూరం కాకూడదని లయన్స్ అధ్యక్షుడు జగన్ బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ టి.రామకృష్ణారావు, సెక్రటరీ బి.వి.రంగయ్య, ట్రెజరర్ ఏ.వి.నారాయణరెడ్డి, సభ్యులు ఆర్.రంగాచారి, ఓ.రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలవిహార్ విద్యార్థులకు స్తోత్రాలు భజన సంకీర్తనల్లో శిక్షణ

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 04**
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవనంలో శ్రీగిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులకు ఆదివారం నుండి స్తోత్రాలు భజన సంకీర్తనలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. స్వామిని శారదా ప్రియా నంద సంకలనం చేసిన శ్రీ చిన్మయ స్తోత్ర భజనమాల గ్రంథంలోని స్తోత్రాలను భజన సంకీర్తనలను




విద్యార్థులకు నేర్పించడం జరుగుతుందని చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద వెల్లడించారు. బాలవిహార్ విద్యార్థులకు భగవద్గీత పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి పర్యవేక్షించారు. విద్యార్థులకు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

# బేస్తవారిపేటలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

## రూ.4.55 కోట్లతో రహదారుల నిర్మాణం -పల్లె పండుగ--3.0 పనులకు

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శంకుస్థాపన





**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 04**

బేస్తవారిపేట మండలంలో పల్లె పండుగ--3.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రూ.4.55 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు తారు రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి శంఖుస్థాపన లు చేశారు.నేకునాంబాద్ -- 2 పనులు రు60 లక్షలు. గలిజేరుగుళ్ల -- 3 పనులు రు1.45 కోట్లు. జె.సి. అగ్రహారం -- 3 పనులు రు1.50 కోట్లు. బేస్తవారిపేట -- 3 పనులు 1.00 కోటి రూపాయలతో మొత్తం: 11 పనులకు గాను రు 4.55 కోట్ల రూపాయలతో తారు రోడ్లు, అంతర్గత సి సి రోడ్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ ముత్తుముల అశోక్ రెడ్డి శంకుస్థాపన చేశారు. బార్లకుంట--బాలేశ్వరపురం, గల్జేరుగుల్ల--చెన్నుపల్లె, పిట్టకాయగుల్ల--వంగపాడు, జె.సి. అగ్రహారం--కె.మల్లపురం, ఒంగోలు హైవే--సలకలవీడు, మోక్షగుండం--ఖాజీపురం తదితర మార్గాల్లో రహదారి పనులతో పాటు పిట్టకాయగుల్ల, మోక్షగుండం గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండుగ--3.0 ద్వారా గ్రామాల రూపురేఖలు మారుస్తూ అభివృద్ధిని ప్రతి పల్లెకు చేరుస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బేస్తవారిపేట మండలం ప్రముఖులు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి ఆస్పత్రి లో ఉచిత మెగా వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

### 50 మందికి కంటి పరీక్షలు , శస్త్ర చికిత్సలు





**గిద్దలూరు, పెన్ పవర్, అక్టోబర్ 4**

పది రూపాయల డాక్టర్ గా పేరు గడించి పేదల సేవలో నిమగ్నుడై పలు గ్రామాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఎన్. బ్రహ్మానందరెడ్డి తన గాయత్రి వైద్యశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంల నిపుణులైన వైద్యులు వివిధ పరీక్షలు 300 మందికి పైగా నిర్వహించగా 50మంది కంటి శస్త్ర చికిత్సకు వైద్యులు సిఫారసు చేసి వీరికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నారు. ఈ శిబిరంలో 2డి ఎకో, మధుమేహం, రక్తపోటు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఈ శిబిరంలో కార్డియాక్, ఆర్థోపెడిక్, గైనిక్, ఆప్తాల్మజీ నిపుణులు డా. నారాయణరెడ్డి, డా.బ్రహ్మానంద రెడ్డి, డా. గాయత్రి, డా. భవ్య, గాయత్రి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పాలకుల నిరాదరణకు అద్దం పడుతున్న జంఝావతి ప్రాజెక్ట్.



**కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పరిశీలనలో వెల్లడి**

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 04 పెన్ పవర్.**మన్యం జిల్లాలో గల వేలకొద్దీ రైతుల జీవనాడి ఆనాటి ముఖ్యమంత్రి,రైతుబంధు వైయస్ రాజశేఖర్ రెడ్డి సత్సంకల్పంతో.విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన సాగునీటి ప్రాజెక్టు రబ్బరు డ్యాం(జంఝావతి ప్రాజెక్టు)పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోక,మన పాలకుల నిర్లక్ష్యానికిబివివక్షకు అద్దం పడుతోందని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడ్డారు.ఈ మేరకు ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా పై ప్రాజెక్ట్ ను సందర్శించి,జలాశయం వృథాగా పడిఉన్న తీరును పరిశీలన పిదప పై విధంగా స్పందించారు.ఈ సందర్భంగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అడ్డాకుల చిన్నారావు మాట్లాడుతూ.కురుపాం నియోజకవర్గంలో గల కొమరాడ మండలం రాజ్య లక్ష్మీపురం వద్ద కోట్ల కొద్ది రూపాయలు వెచ్చించి,వేలకొద్ది సాగు భూమికి సాగునీటిని అందించుతూ,రైతుల మోములో చిరునవ్వుతో పాటు,పెద్ద మొత్తంలో సాగు రైతులు జీవిస్తున్నఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు.నాటి ముఖ్యమంత్రివర్యులు రాజశేఖర్ రెడ్డి 2006 జనవరి 01 న తన చేతులు మీదుగా జాతికి అంకితం చేశారని,దీంతో ఈ పరిసర ప్రాంతాల్లో గల రైతులలో ఆనందం వెల్లి వెలిసిందని,కాలక్రమేనా జలాశయం నిర్వహణ కొరవరడంతో సంబంధిత శాఖ అధికారుల అలసత్వం మూలంగా అనాధారణకు గురవుతోందని అన్నారు.ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టి 24,640 ఎకరాలకు సాగునీరు అందించుట లక్ష్యం కాగా,ప్రకృతి ప్రకోపానికి గురవడం వెరసిగత జగన్ నాయకత్వంలో గల వైసిపి ప్రభుత్వం,సీఎం చంద్రబాబు నేతృత్వంలో గల ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలునిరాదరణతో మరమ్మతులకు గురై పడి ఉందన్నారు.జలాశయానికి కుడి,ఎడమల కాలువల ద్వారా రైతులకు కావలసిన సాగునీటిని అందించడంలోనూ,మరి ముఖ్యంగా జలాశయం బాధిత గ్రామాలకు చెందిన ఒడిస్సా ప్రభుత్వ వివాదానికి సంబంధించి సమస్యను పరిష్కరించడంలోనూ ఇప్పటికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సైతం దోబూచులాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంకను ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలు వేరసి సంబంధిత సాగునీటి శాఖ అధికారులు మేల్కొని పై ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నిర్మాణానికి,నిర్వహణకు చిత్తశుద్ధితో కృషి చేయవలసిందిగా చిన్నారావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కొమరాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హిమరీక భాస్కరరావు,గిరిజన సంఘం హక్కుల పోరాట కమిటీ ప్రతినిధులు మోసూరు నాగభూషణ్,మోసూరు త్రినాథ్,యువజన సంఘం అధ్యక్షుడు కొండ గౌరి చరణ్ పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.

**బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పిల్లా సతీష్.**





**పరవాడ: పెన్ పవర్: అక్టోబర్ 04:** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు పిల్ల సతీష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం తాడి గ్రామంలో నిర్వహించిన కార్యకర్త సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్డీఏ కూటమిలో భారతీయ జనతా పార్టీ భాగస్వామిగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న నిధులను, చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం స్థానిక ఎన్నికల గురించి చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పట్టాభి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.మండల ప్రభారి జే వి ఎస్ రాజు, సీనియర్ నాయకులు ముత్యాల అప్పారావు, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు కూండ్రపు సోమనాయుడు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు దత్తి శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు దాలిబోయిన సంజీవరావు మరియు మండల ప్రధాన కార్యదర్శులు బంతికోరు గోవిందరాజు ,పండూరి రమేష్ తదితర మండల పదాధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 04**

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో రాణించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కోరారు. 24వ రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్ లో ఎమ్మెల్యే జనార్దన్ ప్రారంభించారు. ముందుగా ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను దామచర్ల కలిసి వారిని అభినందించారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తైక్వాండో వంటి క్రీడల్లో రాణిస్తే జీవితంలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుందన్నారు. స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత చదువు, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్లో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాలని దామచర్ల జనార్దన్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒనుడా ఛైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, యూ. మారుతి ప్రసాద్, సెక్రెటరీ వైకే శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా హెడ్ కోచ్ శరవణ తదితరులు పాల్గొన్నారు.

# అట్లూరు టిడిపి పరిశీలకునిగా బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు

### శాలువాతో సత్కరించి అభినందించిన డిసిసిబి చైర్మన్



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 4**

రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ను పొద్దుటూరు కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా టిడిపిలో కీలక బాధ్యతలు బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండల టిడిపి పరిశీలకునిగా నియమించారు. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, కడప డిసిసిబి చైర్మన్ సత్యనారాయణరెడ్డి డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అట్లూరు మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వై. పి. రంగయ్యకు ఘన సన్మానం

**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 04**

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా నియమితులైన వై పి్ా. రంగయ్య ను తహశీల్దార్ అంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వై పి రంగయ్య కు శుభాకాంక్షలు తెలియజేసి, ఉద్యోగుల సంక్షేమం , సంఘం అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏ. నాయబ్ హుస్సేన్, మండల సర్వేయర్ ఎమ్. ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరిగేలా వెంకట రామయ్య, బి రాజశేఖర్ రెడ్డి, జి అచ్చయ్య, బి వెంకటేశ్వర్లు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, గ్రామ గ్రామ సర్వేయర్లు ఖాజావలి, రాము, వినోద్, మురళి, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓ ఆంజనేయులు, అల్లూరయ్య సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవ్ సూర్యవంశీకి నో ఛాన్స్.. వెస్టిండీస్‌తో తొలి T20కి ప్లేయింగ్ XI ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా.. ఇప్పుడు 5 మ్యాచ్‌ల ౨20 సిరీస్‌కు సిద్ధమైంది. పొట్టి ఫార్మాట్‌లో జరగనున్న ఈ సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి లక్నోలోని ఏకనా క్రికెట్ స్టేడియం దీ గ్రౌండ్‌లో ప్రారంభం కానుంది. ఇటీవల జపాన్ వేదికగా ముగిసిన 2026 ఆసియా క్రీడలలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు స్వర్ణ పతకం సాధించి అజేయ ఊపు మీదుంది. ఆసియా గేమ్స్ లో వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఆడిన ఈ యువ జట్టు, ఇప్పుడు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో విండీస్‌తో తలపడనుంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా పేస్ స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు దూరంగా ఉంది.

**తొలి T20I కోసం పుజారా ప్లేయింగ్ XI ఇదే:**

ఈ నేపథ్యంలో వెస్టిండీస్‌తో జరగబోయే తొలి ౨20 మ్యాచ్ కోసం టీమిండియా మాజీ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా స్టార్ స్పోర్ట్స్ కోసం తన ప్లేయింగ్ ఎలెవెన్‌ను ప్రకటించాడు. ఆసియా క్రీడల్లో అద్భుత ప్రదర్శన చేసిన యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని పుజారా తన తుది జట్టు నుంచి పక్కన పెట్టి బెంచ్‌కే పరిమితం చేశారు.

ఓపెనర్లుగా వికెట్ కీపర్ సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు పుజారా చోటు కల్పించారు. ఇక మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లను ఎంచుకున్నారు. మిగతా బ్యాటింగ్ ఆర్డర్‌లో తిలక్ వర్మ (5), శివమ్ దూబే (6), ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (7) స్థానం సంపాదించారు.

స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్‌లకు చోటు దక్కగా.. పేస్ అటాక్‌లో అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. అయితే ఆశ్చర్యకరంగా ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు పుజారా తన తుది జట్టులో చోటు కల్పించలేకపోయాడు.

వెస్టిండీస్‌తో జరిగే తొలి ౨20 కోసం నా ప్లేయింగ్ ఎలెవెన్ ఇదే: సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా వస్తారు. నం.3లో ఇషాన్ కిషన్, నం.4లో శ్రేయస్ అయ్యర్, నం.5లో తిలక్ వర్మ, నం.6లో శివమ్ దూబే, నం.7లో నితీశ్ కుమార్ రెడ్డి, నం.8లో అక్షర్ పటేల్, నం.9లో కుల్దీప్ యాదవ్, నం.10గా అర్ష్‌దీప్ సింగ్, నం.11గా ప్రిన్స్ యాదవ్ ఉంటారని పుజారా పేర్కొన్నారు.

**తొలి T20 ప్లేయింగ్ ఎలెవెన్:**

సంజు శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

# ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు.. వారి అనుభవమే మా విజయానికి కారణమైంది: సంజూ శాంసన్

**ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్న భారత పురుషుల క్రికెట్ జట్టు**
**ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదని వ్యాఖ్యానించిన సంజూ శాంసన్**
**అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉండటమే విజయానికి కారణమని వెల్లడి**
**ఫైనల్ ఒత్తిడిని అధిగమించడంలో సీనియర్లు కీలకపాత్ర పోషించారన్న సంజూ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు. ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది.

"చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే ఆడామని, ఒత్తిడిని దరిచేరనీయలేదని సంజూ స్పష్టం చేశాడు.

## నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా దాన్ని అందుకోవాలి: గవాస్కర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ తో చివరి వన్డేలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుత ఫామ్‌తో 92 పరుగులు చేసినప్పటికీ, భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేశాడు. సెంచరీకి కేవలం 8 పరుగుల దూరంలో రోహిత్ ఔట్ కావడం తనను నిరాశపరిచిందని అన్నాడు. రోహిత్ శర్మ తన కెరీర్‌ను ఓ ప్రత్యేకమైన మైలురాయితో ముగించాలని తాను కోరుకుంటున్నట్లు గవాస్కర్ ఒక ఆసక్తికర లక్ష్యాన్ని నిర్దేశించాడు. జియోస్టార్‌లో ప్రసారమైన 'హయర్ క్రికెట్ లైవ్' కార్యక్రమంలో గవాస్కర్ మాట్లాడుతూ.. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత సుమారు 40 ఏళ్ల వయసులో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. నా వ్యక్తిగత కోరిక ఏంటంటే.. అతను రిటైర్ అయ్యే నాటికి అతని వయసు కన్నా ఎక్కువ వన్డే సెంచరీలు చేయాలి. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 35 సెంచరీలు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో శతకం పూర్తి చేసి ఉంటే, ఆ సంఖ్య 36కు చేరేది. తద్వారా 40 సెంచరీల మార్క్‌కు మరింత దగ్గరయ్యేవాడు" అని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా తన కెరీర్‌లోని చివరి దశను గవాస్కర్ గుర్తుచేసుకున్నాడు. "నాకు 38 ఏళ్ల వయసులో, టెస్టుల్లో 38 సెంచరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ దురదృష్టవశాత్తు మూడుసార్లు 90ల్లో ఔటయ్యాను. అందుకే రోహిత్ సెంచరీ మిస్ కావడం చూసి నిరాశ చెందాను. నేను సాధించలేకపోయాను.. రోహిత్ అయినా ఆ ఘనత అందుకోవాలి" అని అభిలషించాడు. అదే సమయంలో 2023 ప్రపంచకప్ తర్వాత రోహిత్ బ్యాటింగ్ శైలిలో మార్పు వచ్చిందని గవాస్కర్ విశ్లేషించాడు. "ప్రపంచకప్‌లో మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడేవాడు. ఇప్పుడు తన వికెట్‌కు ఎక్కువ విలువ ఇస్తున్నాడు. ఇది మంచి పరిణామమే. అయినా, రోహిత్‌ను నేను 30–40 పరుగులు చేసే ఆటగాడిగా కాకుండా, 'సెంచరీల వీరుడు'గానే చూస్తాను" అని స్పష్టం చేశాడు.

# మహేష్ బాబు పేరిట నమోదైన వరస్ట్ రికార్డులు ఏంటంటే.?

'రాజకుమారుడు' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నటుడు మహేష్ బాబు...మొదటి సినిమాతోనే ప్రిన్స్ గా తనకంటూ ఒక ట్యాగ్ ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత చేసిన సినిమాలతో కొంతవరకు మెప్పించినప్పటికి తన పూర్తిస్థాయి నట పోటెన్షియాల్టిని బయటికి తీసిన సినిమా మాత్రం 'నిజం' అనే చెప్పాలి. అందులో ఒక డీసెంట్ యాక్టింగ్ లో మహేష్ బాబు నటన చూసిన చాలా మంది మహేష్ బాబు గొప్ప నటుడు తను ఎలాంటి పాత్రనైనా సరే చేయగలడు అంటూ అతని గురించి గొప్పగా మాట్లాడారు. ఇక ఈ క్రమంలోనే 'ఒక్కడు' సినిమాతో ఆయన మాస్ లో తన ఫ్యాన్ ఫాలోయింగ్ ను విస్తరించుకున్నాడు. అలాగే తన కెరియర్ లోనే మొదటి బ్లాక్ బాస్టర్ సక్సెస్ ని సాధించాడు. పోకిరి, దూకుడు, శ్రీమంతుడు, భరత్ అనే నేను, మహర్షి లాంటి సినిమాలతో ఇండస్ట్రీ రికార్డులను క్రియేట్ చేశాడు. యావత్ తెలుగు సినిమా ప్రేక్షకులందరిని అలరించాడు. అలాంటి మహేష్ బాబు కెరియర్ లో కొన్ని వరస్ట్ రికార్డులు కూడా ఉన్నాయి. మహేష్ అభిమానులు వీటి గురించి మాట్లాడడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ మహేష్ బాబు ఎవరినైతే నమ్మాడో వాళ్లే అతనికి వరస్ట్ రికార్డులను కట్టబెట్టారు. అప్పటినుంచి మహేష్ బాబు పూర్తి కథలను విని డేట్స్ ఇవ్వాలని బ్లైండ్ గా ఫిక్స్ అయ్యాడు. తమిళ్ సినిమా ఇండస్ట్రీలో తుపాకీ, కత్తి లాంటి వరుస బ్లాక్ బాస్టర్ సక్సెస్ లను





అందుకున్న మురుగదాస్ డైరెక్షన్లో నటించాలని ఉంది అంటూ మహేష్ బాబు ఒక ఇంటర్వ్యూలో ఓపెన్ గా చెప్పాడు. దాంతో మురుగదాస్ సైతం మహేష్ బాబు నిర్ణయానికి కట్టుబడి 'స్పైడర్' అనే సినిమాని మహేష్ బాబుతో చేద్దామని అతనికి కథను వినిపించాడు. కథ కూడా మహేష్ బాబు ఫైనల్ చేశాడు. మొత్తానికైతే మురుగదాస్ మీద పూర్తి నమ్మకంతో సినిమా ఎలా వస్తుంది ఏంటి అనే విషయాలను కూడా పట్టించుకోని మహేష్ బాబు తనను పూర్తిగా నమ్మాడు. దాంతో కథ విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేసిన మురుగదాస్ మొత్తానికైతే స్పైడర్ సినిమా రూపంలో మహేష్ బాబుకి ఒక భారీ డిజాస్టర్ ను కట్టబెట్టాడు. 120 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా దాదాపు 50 కోట్ల వరకు నష్టాన్ని మిగిల్చింది...

**బ్రహ్మోత్సవం**

'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాతో సక్సెస్ ని అందించిన శ్రీకాంత్ అడ్డాల తో మహేష్ బాబు మరో సినిమా చేయాలనుకున్నాడు. ఒక సినిమాతో తనకి సక్సెస్ ను అందించిన దర్శకుడిని మరోసారి రిపీట్ చేస్తూ మూవీ చేయడం మహేష్ కి అప్పట్లో ఆనవాయితీగా మారింది. కాబట్టి సీతమ్మ వాకిట్లో మూవీ తరువాత మరోసారి శ్రీకాంత్ అడ్డాలను సైతం కథ రెడీ చేసుకోమని చెప్పాడు. దాంతో 'బ్రహ్మోత్సవం' కథతో శ్రీకాంత్ మహేష్ బాబు దగ్గరికి వచ్చాడు. నిజానికి మహేష్ బాబు ఆ పూర్తి కథ కూడా వినకుండా కేవలం శ్రీకాంత్ అడ్డాల మీద ఉన్న నమ్మకంతోనే అతనికి సినిమా ఇచ్చాడు. నిజానికి బ్రహ్మోత్సవం సినిమాలో కథ ఏమీ ఉండదు. ఎంతసేపు రిలేషన్ షిప్స్ మీదనే సినిమాను నడిపించే ప్రయత్నం చేశాడు. కానీ అందులో కోర్ ఎలిమెంట్ ఏంటి అనే విషయాన్ని పర్ఫెక్ట్ గా చెప్పలేకపోయాడు. ఎమోషన్స్ సైతం పర్ఫెక్ట్ గా హ్యాండిల్ చేయడంలో దర్శకుడు పూర్తిగా విఫలమయ్యాడు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో బ్రదర్స్ మధ్య బాండింగ్ చాలా గొప్పగా చూపించిన దర్శకుడు బ్రహ్మోత్సవం సినిమా విషయంలో పూర్తిగా చేతులెత్తేశాడు. దానివల్ల ఈ సినిమా భారీ ఫ్లాప్ గా నిలిచింది. దాదాపు 40 కోట్ల వరకు ప్రొడ్యూసర్లకు నష్టాన్ని మిగిల్చింది...



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com